క్లుప్తంగా

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి అందిస్తున్న ఎంఈఓలు

పరిగి: కరాటేలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు ఎంఈఓ లక్ష్మీదేవి, వడ్డే శ్రీక్రాంత్ ఆర్థిక సౌజన్యంతో క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాయలం ప్రాంగణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల కరాటేలో పెంకాక్ సిలాట్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన ఎనిమిది మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులు, బ్యాగులు వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 శేషాచలం, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



తిమ్మయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని 21వ వార్డు మోతుకపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కురుబ తిమ్మయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి మోతుకపల్లికి వెళ్లి తిమ్మయ్య మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వార్డు ఇన్‌చార్జి న్యాతరెడ్డి, నవీన్‌రెడ్డి, లోకేష్, ఆటో తిమ్మయ్య, జయప్ప, చంద్రశేఖర్, శివకుమార్, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి



నాగేంద్ర (ఫైల్)

గుడిబండ: మండల పరిధిలోని మద్దనకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో ఎమ్‌టీఎస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగేంద్ర (55) సోమవారం గుండెపోటుతో చనిపోయారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి పలువురు ఉపాధ్యాయులు ప్రగాడ సానుభూతి తెలిపారు.

రణభేరి పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

మడకశిర: మడకశిరలోని 4వ వార్డు ప్రాథమిక పాఠశాల ఆవరణంలో సోమవారం యూటీఎఫ్ నాయకులు రణభేరి సభ పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 25న గుంటూరులో రణభేరి సభను నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని, లేకపోతే 29 శాతం ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్‌సీ బకాయిలను కూడా వెంటనే మంజూరు చేయాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు భూతన్న, నాయకులు మూడ్లగిరియప్ప, మాలింగప్ప, జోగప్ప, కదురన్న, రవీంద్ర, యల్లప్ప, దేవరాజు, రామాంజప్ప, నంజప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీపై కక్ష సాధింపు తగదు



తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు, విద్యార్థుల నిరసన

హిందూపురం: నిరుపేద ప్రజలు, విద్యార్థులకు విద్య, వైద్య, గృహ సదుపాయలతో సేవలందిస్తున్న ఆర్డీటీపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపునకు దిగడం తగదని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల ఐక్యవేదిక నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని గాంధీచౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. తర్వాత తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలియజేసి వినతిపత్రం సమర్పించారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు శ్యామ్ కిరణ్, శ్రీనివాసులు, హరికుమార్, రవికుమార్, నారాయణ, మున్నా, తౌసిఫ్, శ్రీరాములు, మహేష్, నౌషాద్, హరి, వెంకట్రామిరెడ్డి, గంగిరెడ్డి, ఇందాద్, ఖలీఫా, నరసింహమూర్తి, హనుమంతరాయప్ప, జమీల్, రాము తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిరండి

పెనుకొండ: సోలార్ కోసం బలవంతపు భూసేకరణకు నిరసనగా ఈ నెల 24న విజయవాడలో ఏపీ రైతు సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగే మహాసభకు రైతులు, ప్రజాసంఘాల నాయకులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు బాబావలి, గంగాధర్ పిలుపునిచ్చారు. పట్టణంలో సోమవారం మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

దేవీ వైభవం

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో అమ్మవారికి సంబంధించిన ఎన్నో మహిమాన్విత ఆలయాలు ఉన్నాయి. శరన్నవరాత్రి వేళ ఆ ఆలయాల విశిష్టతను తెలుసుకుందాం.

- హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ఎన్నో విశిష్ట ఆలయాలు
- ప్రత్యేక రూపాల్లో దర్శనమిస్తున్న తల్లి
- అమ్మవారి ఆలయాల్లో మొదలైన శరన్నవరాత్రి ఉత్సవాలు

వారానికి ఒక్కరోజే దర్శనం



అలంకరణలో సప్తమాతృక అక్కమ్మ

చిలమత్తూరు: కొడికొండ కోటపై వెలసిన అక్కమ్మకు చోళరాజుల కాలం నుంచి పూజలందుకుంటున్నారు. నాటి రాజులు ఏ కార్యం చేయాలన్నా మొదట అమ్మవారిని దర్శించుకున్న తర్వాతనే మొదలు పెట్టేవారట. దీంతో వారి పనులు చక్కగా పూర్తయ్యేవని చెబుతున్నారు. నాటి నుంచి నేటి దాకా అక్కమ్మ అమ్మవారు పూజలందుకుంటున్నారు. అయితే వారంలో ఒక్కరోజు మాత్రమే అమ్మవారు ఇక్కడ దర్శమిస్తారు. ప్రతి శుక్రవారం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. కోటపై సప్తమాతృక అమ్మవారి పాద ముద్రికలున్నాయి. శరన్నవరాత్రులు ప్రారంభమైన నేపథ్యంలో దుర్గాష్టమి, విజయదశమి రోజుల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పంచనందీశ్వరస్వామి ఆలయ అర్చకుడు శంకరనారాయణ తెలిపారు.

కోరికలు తీర్చే కొల్హాపురి మహాలక్ష్మి



రొళ్ల చౌళరాజుల వంశానికి చెందిన రత్నగిరి సంస్థానం మహారాజు అయిన క్రిష్టప్పరాజు సురుపుర్ చెందిన రాణిగౌడమ్మను వివాహం ఆడినట్లు చరిత్ర చెబుతోంది. అప్పట్లో రాణిగౌడమ్మను రత్నగిరి సంస్థానానికి గుర్రపు మార్గాన తీసుకొస్తున్నప్పుడు ఓ రకమైన శబ్దం రావడంతో ప్రశ్నించారు. నేను కొల్హాపురి మహాలక్ష్మీదేవిని మీ సంస్థానంలో కొలువుదీరడం కోసం మీ వెంట పసుపు కుంకుమ రూపంలో వస్తున్నానని చెప్పిందట. రాణిగౌడమ్మ సంస్థానానికి వచ్చిన మరుసటి రోజు అమ్మవారు అరిసిన కుంకుమ (పసుపు కుంకుమ) రూపంలో కొలువుదీరగా దానిపైన నాగుల పుట్ట కూడా పెరిగింది. దీంతో క్రిష్టప్పరాజు రాణిగౌడమ్మ సారథ్యంలో గారబొమ్మతో కూడిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి శిలా విగ్రహంతో పాటు పాలబావిని ఒకే రోజు నిర్మాణం చేపట్టి ప్రతిష్ఠించారు. నాటి నుంచి భక్తుల కోరిన కోర్కెలు తీరుస్తూ కొల్హాపురి మహాలక్ష్మీదేవి అమ్మవారు విరాజిల్లుతున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ.

చోళుల చెల్లెమ్మ చోళామాంబదేవి



అమరాపురం: మండల కేంద్రంలో వెలసిన చోళమాంబదేవి 800 ఏళ్ల చరిత్ర ఉంది. గ్రామ పెద్దల గాథ మేరకు.. చోళులు హేమావతి కేంద్రంగా చేసుకుని పరిపాలన చేసేవారు. ఒక రోజు చోళరాజు తన చెల్లి చోళమాంబను తీసుకుని అమరసింహ కవితో పాటు అమరాపురంలో నిర్మాణంలో ఉన్న చెరువును పరిశీలించడానికి వస్తుండగా అమరాపురంలో ఆమె పుష్పవతి అయిందట. చెరువు పాదాల వద్ద తన చెల్లిని చోళమాంబదేవిగా పరిచయం చేశారట. ఆ సమయంలోనే వారు ఆమెను వదిలి వెళ్లి వచ్చేలోపు ఆమె తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో అక్కడే ప్రాణప్రతిష్ఠ చేశారట. నాటి నుంచి చోళమాంబను పూజిస్తున్నారని చెబుతున్నారు. ఏటా దసరా ఉత్సవాలను ఇక్కడ వైభవంగా జరుపుకుంటారు.

కరుణించే రొద్దకాంబదేవి



రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున శ్రీకృష్ణదేవ రాయల కాలంలో ప్రతిష్ఠించిన రొద్దకాంబదేవి గ్రామ కల్పతరువుగా మారింది. 500 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయంలో మహిళలే అర్చకులుగా ఉంటూ వస్తున్నారు. రొద్దానికి అనుకుని ఉన్న పెన్నానదిలో ఏళ్ల క్రితం ఒక రాతి విగ్రహం నీటి ప్రవాహంలో కొట్టుకుని వచ్చిందని, పశువుల కాపరికి కనిపించి తాను రొద్దకాంబదేవినని, మీ గ్రామ దేవతగా ఉంటానని, తనను ఇక్కడే ప్రతిష్ఠించాలని చెప్పినట్లు గ్రామ పెద్దలు చెబుతున్నారు. అమ్మవారిని అక్కడే ప్రతిష్ఠించగా అప్పటి వరకూ రౌరిద్రిపురంగా ఉన్న గ్రామం కాస్తా రొద్దంగా మారింది. నాటి నుంచి నేటి వరకూ గ్రామాన్ని చల్లగా కాపాడుతోందని భక్తుల నమ్మకం.

భక్తులకు కొంగు బంగారం వీరకేతమ్మ



మడకశిరరూరల్: మండల కేంద్రానికి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న కల్లుమర్రి గ్రామ సమీపంలో వెలసిన వీరకేతమ్మ కోరిన కోర్కెలు తీరుస్తూ భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. 900 సంవత్సరాల క్రితం వెలసిన అమ్మవారు శారీరక, మానసిక బాధలు, దుష్ట గ్రహ పీడలు, సంసారిక కష్టాలు తీరుస్తారని ప్రతీతి. మన రాష్ట్రంతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వారం రోజుల పాటు అలంకరణల్లో అమ్మవారు దర్శనమిస్తారు.

స్తంభంలో కొలువుదీరిన దుర్గమ్మ



లేపాక్షి: ప్రసిద్ధి చెందిన లేపాక్షి వీరభద్ర స్వామి దేవాలయంలో దుర్గమ్మ అమ్మవారు స్తంభంలో కొలువుదీరారు. వీరభద్ర స్వామి దేవాలయం నిర్మించే కాలంలో అక్కడున్న వారికి దుర్గాదేవి ఆవాహమై తాను ఈ స్తంభంలోని శిల్పంలో ఉంటానని, తనకు పూజలు చేయాలని చెప్పరాట. అయితే శిల్పంలో భక్తులు అమ్మవారిని తిలకించడానికి ఇబ్బంది పడతారని అందరికి కనిపించే విధంగా పెద్ద అద్దాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ దసరా ఉత్సవాలు ఎంతో వేడుకగా జరుపుతారు.

అమ్మవారి దర్శనం.. సకలపాప హరణం



లేపాక్షి ఆలయంలో కొలువుదీరిన దుర్గాదేవి ఎంతో మహిమాన్వితురాలు. కోరిన కోర్కెలు తీర్చేదైవంగా ప్రసిద్ధి చెందారు. లేపాక్షి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుపుతాము. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల నుంచి అనేక మంది భక్తులు విచ్చేసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

– నరసింహశర్మ, అర్చకులు

చెరువు తెగకుండా కాపాడుతున్న తల్లి



పరిగి: మండల పరిధితో పాటు రామగిరి మండలంలోని పేరూరు డ్యామ్ వరకూ ఉన్న అనేక గ్రామాలను కాపాడుతున్న గ్రామ దేవతగా పరిగి మండల కేంద్రంలోని కొలువుదీరిన సప్తమాత్రుక అమ్మవారికి ఎంతో పేరుంది. దాదాపు 7వ శతాబ్దంలో ఇక్కడి ఆలయాన్ని నిర్మించినట్లు మైసూరు ఆర్కియాలజిస్టు సర్వేలో వెల్లడైంది. పరిగి పెద్ద చెరువు తెగకుండా నేటికీ అమ్మవారే కాపాడుతున్నారని భక్తుల నమ్మకం.

మహిమాన్వితురాలు సప్తమాత్రుక తల్లి



పరిగిలో వెలసిన సప్తామాత్రుక అమ్మవారు మహిమాన్వితురాలు. పరిగి చెరువు తెగిపోతే వందలాది గ్రామాలు కొట్టుకుపోవడం ఖాయం. అందుకే ఏళ్లుగా ఆ చెరువుకు రక్షగా అమ్మవారే కాపాడుతూ వస్తున్నారు. ఇదే విషయం ఇక్కడి శాసనాల్లో సైతం స్పష్టంగా ఉంది.

– ప్రవీణ్‌కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు

వాసవీమాత ఆలయానికి వందేళ్లు



పెనుకొండ: పట్టణంలోని ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీ మాత భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. ఈ ఆలయాన్ని ప్రతిష్ఠించి వందేళ్లు పూర్తయింది. ఆర్యవైశ్యులతో పాటు ప్రజలు ఎంతో నిష్ఠతో అమ్మవారిని కొలుస్తుంటారు. శరన్నవరాత్రి సందర్భంగా అమ్మవారికి రోజూ ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహిస్తామని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని అర్చకులు తెలిపారు.



లేపాక్షి మండలం చోళసముద్రంలో చౌడేశ్వరీదేవి



దేమకేతేపల్లిలో బాలా త్రిపుర సుందరిగా చౌడేశ్వరీదేవి



అమరాపురంలో పార్వతీదేవిగా కన్యకా పరమేశ్వరి



రొళ్ల మండలం జీరిగేపల్లిలో అమ్మాజి దేవతలు



సోమందేపల్లి: వేద గాయత్రిగా కన్యకాపరమేశ్వరి



పెనుకొండ: బాలా త్రిపుర సుందరిగా మహేశ్వరి



మడకశిర: అలంకరణలో వడిసిలమ్మ

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలపాలైన సద్దాం హుస్సేన్ వద్ద రోదిస్తున్న భార్య

అగళి: మూత్ర విసర్జనకు పొలంలోకి వెళ్లిన యువకుడిని కారు అతివేగంగా ఢీ కొట్టడంతో తీవ్ర గాయాల పాలైన సంఘటన సోమవారం మండల పరిధిలోని హెచ్‌డీ హళ్లి గ్రామ సమీపంలోని మండే మారమ్మ గుడి వద్ద జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. ఉలియారు నుంచి తమ స్వగ్రామం ఎస్. రాయపురానికి సద్దాం హుస్సేన్ తన భార్య కుమారుడితో కలసి బైక్‌పై బయలు దేరాడు. జాతీయ రహదారిలోని హెచ్‌డీ హళ్లి గ్రామ సమీపంలోని మండేమారమ్మ గుడి వద్ద బండిని ఆపి మూత్ర విసర్జన కోసం సద్దాం హుస్సేన్ పొలంలోకి వెళ్లాడు. ఇదిలా ఉండగా పావగడలోని సంత మార్కెట్లో మేకను కొనుగోలు చేసుకుని సిర సమీపంలోని చెన్నెనహళ్లిలోని బంధువుల ఇంటికి కారులో మంజునాథ్‌నాయక్ వెళ్తున్నారు. అతి వేగంగా వెళ్తూ సంఘటనా స్థలం వద్ద ముందు వెళ్తున్న ట్యాంకర్ ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లాడు. ఆ నేపథ్యంలో మూత్ర విసర్జన చేస్తున్న సద్దాంహుస్సేన్‌ను కారు ఢీ కొంది. దీంతో సద్దాంహుస్సేన్ తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. కాళ్లు చేతులు విరిగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. అక్కడే ఉన్న భార్య కుమారుడు కన్నీరు మున్నీరుగా విలపించడం పలువురిని కంటతడి పెట్టించింది. స్థానికులు వెంటనే సద్దాం హుస్సేన్‌ను బెంగళూరుకు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజీ హళ్లి సరిహద్దుకు ఎలుగు



హొసకట్టవద్ద ముళ్ల పొదల్లో దాక్కున్న ఎలుగు బంటి (వృత్తంలో)

రొళ్ల: అటవీ ప్రాంతంలో సంచరించాల్సిన వన్యప్రాణులు ఆహారం దొరక్క గ్రామాల వైపు వస్తున్నాయి. సోమవారం సాయంత్రం రొళ్ల మండలం బీజీ హళ్లి సమీపంలోని హొసకట్ట వద్ద ఎలుగు బంటి ఆహారం వెతుక్కుంటూ వచ్చింది. అటుగా వెళ్లిన కొందరు ఎలుగు బంటిని చూసి ఆందోళనతో పరుగులు తీశారు. ఎలుగుబంటి ముళ్ల పొదల్లోకి వెళ్లే దృశ్యాన్ని స్థానికులు సెల్‌ఫోన్లలో చిత్రీకరించడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

'గ్రీవెన్స్'కు అధికారుల డుమ్మా



డీటీ జగన్నాథ్, కానిస్టేబుల్ శ్రీనివాసులు మాత్రమే గ్రీవెన్స్‌కు హాజరైన దృశ్యం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక తూతూ మంత్రంగా సాగుతోంది. తహసీల్దార్‌తో పాటు అధికారులు కూడా హాజరుకాకపోవడంతో వివిధ శాఖల అధికారులకు అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన వారు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కేవలం డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథ్, కానిస్టేబుల్ శ్రీనివాసులు మాత్రమే హాజరయ్యారు. తహసీల్దార్ వెంకటేష్ ఎట్టకేలకు సోమవారం కార్యాలయానికి వచ్చినా గ్రీవెన్స్‌కు మాత్రం డుమ్మా కొట్టారు. క్యాబిన్‌లోనే ఉండికూడా రాకపోవడం సరికాదని అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆరోగ్య ఉప కేంద్రం భవనాన్ని నిర్మించండి



మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రం అందిస్తున్న కొడిగెనహళ్లి గ్రామస్తులు

పరిగి: పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న కొడిగెనహళ్లి ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని వెంటనే నిర్మించాలని స్థానికులు సోమవారం అధికారులకు వినతిపత్రాలు అందించారు. గత 40 ఏళ్లుగా కొడిగెనహళ్లిలో సబ్ సెంటర్ ద్వారా దాదాపు 25 వేల జనాభాకు వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. అయితే ఇటీవల ఆ భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఈక్రమంలో పాతబడిన సబ్ సెంటర్ భవనాన్ని తొలగించి కొత్త భవన నిర్మాణానికి అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేయడంతో పాటు నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలను అందించాలని తహసీల్దార్ హసీనా సుల్తానా, మెడికల్ ఆఫీసర్లు నవీన, స్వరూపరెడ్డి, ఎంపీడీఓ రెడ్డెప్పకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

ఐచర్ ఢీకొని ఆవు మృతి

చిలమత్తూరు: మండల పరిధిలోని 544ఈ జాతీయ రహదారి తుమ్మలకుంట క్రాస్ వద్ద సోమవారం సాయంత్రం ఐచర్ ఢీ కొనడంతో పాడి ఆవు మృతి చెందింది. తుమ్మలకుంటకు చెందిన ఓ రైతు ఆవును మేత కోసం పొలాలకు తీసుకెళ్లారు. సాయంత్రం ఇంటికి తీసుకెళ్తుండగా హైవే దాటే క్రమంలో వేగంగా వచ్చిన ఐచర్ ఆవుని ఢీకొంది. దీంతో రూ.60 వేలు విలువ చేసే పాడి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి ఆత్మహత్య

మడకశిరరూరల్: మండల పరిధిలోని టీడీ పల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు నరసమ్మ (64) సోమవారం ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాలమేరకు.. నరసమ్మ మద్యానికి అలవాటు పడింది. మద్యం మానుకోవాలని కుటుంబ సభ్యులు చెప్పడంతో మనస్తాపం చెంది ఆదివారం సాయంత్రం ఎలుకల మందు సేవించింది. ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నిధులు విడుదల చేయండి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచులు

మడకశిర: గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని కోరుతూ సోమవారం మండలంలోని సర్పంచులు స్థానిక ఎంపీడీఓ సోనీబాయికి వినతి పత్రం సమర్పించారు. నిధులు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు. సర్పంచులు కరియన్న, నరసింహమూర్తి, తిమ్మారెడ్డి, హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

అగళి: అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేశామని, తమకు వెంటనే బిల్లులు చెల్లించాలని సర్పంచులు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఈఓఆర్డీ పద్మను డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓతో మండలంలో ఉన్న సర్పంచులు సమావేశమయ్యారు. 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలన్నారు.

గుడిబండ: సర్పంచుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మండల వ్యాప్తంగా ఉన్న సర్పంచులు సోమవారం ఎంపీడీఓ కేశవరెడ్డి, ఈఓఆర్డీ నాగరాజునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న సర్పంచులు పాల్గొన్నారు.

నేతన్న భరోసా పథకాన్ని అమలు చేయండి

హిందూపురం: చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేతన్న భరోసా పథకం అమలు చేస్తూ చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీని జీవోను వెంటనే అమలు చేయాలని చేనేత ఐక్యవేదిక నాయకులు కోరారు. సోమవారం హిందూపురం నుంచి పుట్టపర్తిలో కలెక్టర్ గ్రీవెన్స్ కార్యక్రమానికి తరలివెళ్లారు. కలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించి ఇబ్బందులను వివరించారు. ఐక్యవేదిక సభ్యులు దేవరాజు,బాబు. ఆనం, గోవిందప్ప. చేనేత కార్మికులు తదితరులు. పాల్గొన్నారు.